వేట కరువు.. బతుకు బరువు


వారంతా సముద్రాన్ని నమ్ముకున్న గంగ పుత్రులు. చేపల వేటే జీవనాధారం. వరుస విపత్తులతో వారి బతుకులు నడి సముద్రంలో నావలా తయారయ్యాయి. ప్రతికూల వాతావరణం, చేపల వేట నిషేధం కారణంగా సముద్రంలో వేట కొనసాగలేదు. తాజాగా బుధవారం రాత్రి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో సముద్రంపై పోరుగాలి వీస్తోంది. అలలు ఎగసి పడుతున్నాయి. దీంతో పడవలు తీరానికి చేరాయి. మత్స్యకారులు ఇంటికి పరిమితమయ్యారు. సముద్రంలో మత్స్య సంపద వున్నా చేజిక్కించుకునే అవకాశం లేక ఆకలితో అలమటిస్తున్నారు.

- బతుకు నావకు వాయు గండం
- నిన్నటిదాక వేట నిషేధం
- నేడు ప్రతికూల వాతావరణం
- సంద్రంలో చేపలు ఉన్నా చేతికి అందని వైనం
- ఆకలితో అలమటిస్తున్న మత్స్యకారులు


తీరానికి పరిమితమైన బోట్లు

వాకాడు : తిరుపతి జిల్లాలో 79 కిలోమీటర్లు మేర సముద్ర తీరం వ్యాపించి ఉంది. అందులో 5 తీరప్రాంత మండలాలు, 25 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. 4.5 వేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. 6,500 మంది మత్స్యకారులు చేపల వేటను నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. 13 మర పడవలు, 1,995 ఇంజిన్ బోట్లు, సాధారణ పడవలు వున్నాయి. మత్స్యకారులు సముద్రంలో చేపలు పట్టుకుని విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా రోహిణి కార్తెలో సైతం వరుస వాయుగుండాలు ఏర్పడ్డాయి. భారీ వర్షాలు, పోరుగాలి వెరసి మత్స్యకారులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. నిన్న, మొన్నటి వరకు 61 రోజుల వేట నిషేధంతో ఏదోలా కుటుంబాలను నెట్టుకొచ్చిన వారికి మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. సముద్రంలో చేపలు పుష్కలంగా ఉన్నప్పటికీ ప్రతికూల వాతావరణం నిరాశకు గురి చేస్తోంది. బుధవారం రాత్రి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సముద్రంపై పోరుగాలి, అలల ఉధృతి ఎక్కువై పడవలు తీరానికి, మత్స్యకారులు ఇంటికి పరిమితమయ్యారు. వేట సక్రమంగా సాగక మత్స్యకార కుటుంబాల్లో పూట గడవటం కష్టంగా మారింది. కొందరు బక్కింగ్ హామ్ కెనాల్, పులికాట్, ఉప్పుకయ్యాల్లో నాటు పడవల ద్వారా చేపల వేట సాగిస్తున్నారు. రోజులు తరబడి వేట సాగించినా పెద్దగా ఫలితం ఉండడం లేదని వారు వాపోతున్నారు. ఆటుపోటుల సమయంలో సముద్ర జలాలు ఉప్పుకాలువల్లోకి వస్తాయి. చాలా కాలంగా ముఖద్వారాలు ఇసుక మేటలతో పూడిపోవడంతో ఉప్పు నీరు కాలవల్లోకి రావడం లేదు. ఫలితంగా ఏవో చిన్నపాటి చేపలు దొరుకుతున్నాయి. వాటిని రోడ్లపై విక్రయించి పొట్ట నింపుకుంటున్నారు. వాతావరణం ఎప్పుడు చక్కబడుతుందో, మళ్లీ వేటకు ఎప్పుడు వెళ్తామో అని మత్స్యకారులు సముద్రం వద్ద నిరీక్షిస్తున్నారు.

జిల్లాలోని తీరప్రాంతం –	79 కిలో మీటర్లు
మత్స్యకార మండలాలు –	5
జిల్లాలోని మత్స్యకార గ్రామాలు –	25
మత్స్యకారులు –	6.5 వేలు
మరపడవలు –	13
ఇంజిన్, సాధారణ బోట్లు –	1995

వలను ఒడ్డున సరిచేసుకుంటున్న మత్స్యకారులు, కాలువల్లో చేపలు పడుతున్న జాలర్లు, పోరు గాలిలో సముద్రంపై కుస్తీపడుతున్న మత్స్యకారులు

బోట్లు తిరగబడుతున్నాయి



వరుస విపత్తులతో గత కొన్ని రోజులుగా వేట సాగించడానికి వీలుకావడంలేదు. సముద్రంపై పోరుగాలి వీస్తుండడంతో బోట్లు తిరగబడుతున్నాయి. అలలు 2 నుంచి 4 మీటర్లు ఎత్తుకు ఎగసి పడుతున్నాయి. వేటకు వెళ్లిన బోట్లను అలలు తిప్పి కొడుతున్నాయి. దీతో వేట మానేసి ఇంటి వద్ద పస్తులతో ఉంటున్నాము. – వెంకటేశ్వర్లు, తూపిలిపాళెం

రెండు కిలోల చేపలు దొరుకుతున్నాయి



అల్పపీడనం ప్రభావంతో సము ద్రం ఉగ్ర రూపం దాలి్చంది. భీకరమైన శబ్దాలతో కెరటాలు ఎగసి పడుతున్నాయి. వారం రోజులుగా బోట్లు సముద్రంపై వెళ్లలేకపోతున్నాయి. నిన్న మొన్నటి వరకు వేట విరామంతో పస్తులు ఉండాల్సి వచ్చింది. ఇప్పుడు వాతావరణంలో మార్పు వల్ల వేట చేయలేకపోతున్నాం. – పామంజి యార్నాపూర్, మత్స్యకారుడు, కొండూరుపాళెం

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నేత రవిరెడ్డికి పరామర్శ


రవిరెడ్డితో మాట్లాడుతున్న కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పాలూరు రవిరెడ్డిని గురువారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట కలికి మాధవరెడ్డి, ఒట్టూరు కిషోర్ యాదవ్, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యదర్శి కటకం జయరామయ్య, బైనా మల్లికార్జునరెడ్డి, పాదర్తి హరినాథ్‌రెడ్డి, పేట చంద్రారెడ్డి, ఖాదర్ బాష, రహంతుల్లా తదితరులు వున్నారు.

2న మండల సమావేశం

డక్కిలి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జూలై 2వ తేదీన ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుణ శేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆర్టీఐ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా సదానందరెడ్డి


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన సదానందరెడ్డి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి రూరల్ మండలం పారవోలు గ్రామానికి చెందిన పుల్లూరు సదానందరెడ్డిని వైఎస్సార్ సీపీ ఆర్టీఐ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు ఇచ్చింది. సదానందరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇందుకు కృషిచేసిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

నట్టల నివారణ మందు పంపిణీ

గూడూరు రూరల్ : డీవార్మింగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును పంపిణీ చేసినట్లు గూడూరు పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ సురేష్ తెలిపారు. గురువారం నుంచి జూలై 10వ తేదీ వరకు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా గూడూరు పట్టణంలోని 1, 3, 4 వార్డుల్లో 5 గొర్రెలు, 119 మేకలు, తిప్పవరప్పాడులో 340 గొర్రెలు, పాలిచెర్లలో 570 గొర్రెలు, 80 మేకలు, కొండాగుంటలో 419 గొర్రెలు, 260 మేకలు, చెన్నూరులో 645 గొర్రెలు, 285 మేకలకు నట్టల నివారణ మందు తాగించినట్టు తెలిపారు.

కండలేరులో 34.210 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 34.210 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,260, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

గూడూరు రూరల్: మండలంలోని చెన్నూరులో బుధ, గురువారాలు పోలేరమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. 82 ఏళ్ల తర్వాత చెన్నూరులో 3వ పర్యాయం జాతరను నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు. ఇందులో భాగంగా బజారు సెంటర్‌లో అమ్మవారిని కొలువుదీర్చి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారిని ఊరేగించి నిమజ్జనం చేశారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

వెంకటగిరి రూరల్: పశువులు, గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీఏ శ్రీహరి తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని బంగారుపేటలో గురువారం నట్టల నివారణ కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జూలై 10వ తేదీ వరకు వెంకటగిరి పట్టణం, రూరల్, డక్కిలి మండలాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయనున్నట్టు తెలిపారు. గోపాలమిత్ర చంద్ర, ఓహెచ్ఏ గోవిందు, విశ్వ పాల్గొన్నారు.

దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ డైరెక్టర్‌గా కలువాయి వాసి


కావేటి నరసింహులు

కలువాయి(సైదాపురం): తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ డైరెక్టర్‌గా కలువాయి మండలానికి చెందిన కావేటి నరసింహులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్, ఎస్ఈగా దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో తిరుపతిలో పనిచేశారు. తాజాగా తెలంగాణ రాష్ట్రంలోని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. దీంతో కలువాయి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిన్నారులకు ఆధార్ కార్డులు చేయించాలి

రాపూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులకు తప్పనిసరిగా ఆధార్ కార్డులను చేయించాలని ఐసీడీఎస్ సీడీపీవో సునందన ఆదేశించారు. రాపూరు అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం వేపినాపి క్లస్టర్‌లోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ చిన్నారుల ఎత్తు, బరువును తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. డ్రాప్‌అవుట్స్ లేకుండా చూడాలని, కోడి గుడ్లు, రాగిపిండి నాణ్యత లోపించకుండా చూడాలన్నారు. సూపర్‌వైజర్ రాధిక పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులు

బాలాయపల్లి(సైదాపురం) : ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాలాయపల్లి డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రాజు తెలిపారు. ఆయన గురువారం పిగిలాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డుల్లో తప్పులు సరిచేసుకోవడం, చేర్పులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆధార్ క్యాంపులు పెడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పిగిలాం పంచాయతీ కార్యదర్శి అశోక్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

30న పోలయ్యస్వామి ఆరాధన

డక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లిలో వెలసిన స్తభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో 30న అవధూత గురకుల పోలయ్యస్వామి ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు అభిషేకం, 7 గంటలకు కలశస్థాపన, 9 గంటలకు హారతి, ప్రసాద వినియోగం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 4 గంటలకు అగ్నిగుండం, యాగశాలలో గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధన, నవగ్రహ హోమం, పూర్ణాహుతి చేపడతామని వెల్లడించారు. సాయంత్రం 6 గంటలకు కంకణధారణ, 7 గంటలకు పండరి భజన, రాత్రి 12 గంటలకు స్వామి గ్రామోత్సవం ఉంటాయన్నారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన పాల ఆటో


గాయపడిన ఆటో డ్రైవర్

చిట్టమూరు: మండలంలోని బయ్యావారికండ్రిగ గ్రామ మలుపు రోడ్డు వద్ద గురువారం ఉదయం పాల ఆటో అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. ఓజిలి మండలం మానమాలకు చెందిన ఆటో డ్రైవర్ మొలకల కరుణాకర్ గురువారం చిట్టమూరు మండలంలోని పలు గ్రామాల్లో పాల క్యాన్లు తీసుకుని కోట మండలం విద్యానగర్ వెళుతున్నాడు. బయ్యావారికండ్రిగ గ్రామ మలుపు రోడ్డు వద్ద ముందు వెళుతున్న బైక్‌ను ఓవర్ టేక్ చేస్తుండగా ఆటో అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను స్థానికులు 108లో వాకాడు వైద్యశాలకు, అక్కడి నుంచి గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తాపడి ముగ్గురికి గాయాలు


బోల్తాపడిన ఆటో, పక్కన వున్న కూలీలు

సైదాపురం: మండలంలోని కలిచేడు గ్రామ సమీపంలో గురువారం ఆటో బోల్తాపడడంతో ముగ్గురు గని కార్మికులు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని అనంతమడుగు గ్రామానికి చెందిన రామయ్య తన ఆటోలో పలువురు కార్మికులను ఎక్కించుకుని పొదలకూరు మండలం కొనగలూరు గ్రామంలో వున్న గని వద్దకు తీసుకెళుతూ ఉంటాడు. తిరిగి ఇంటికి చేరుస్తుంటాడు. గురువారం ఉదయం 15 మంది గని కార్మికులతో అనంతమడుగు నుంచి కొనగలూరుకు బయలుదేరాడు. కలిచేడు సమీపంలోని మసీదు దగ్గర ఉన్న కల్వర్టు వద్ద ఆటో బోల్తాపడింది. దీంతో బుల్లెమ్మ, రమణయ్య, వెంకటేశ్వర్లు గాయపడ్డారు. వారిని పొదలకూరు ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారికి గాయాలు కాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్టార్టర్, కేబుల్ చోరీ

చిట్టమూరు: మండలంలోని తాడిమేడు గ్రామ పొలాల్లో వున్న విద్యుత్ స్టార్టర్లు, కేబుల్‌ను బుధవారం రాత్రి దుండగులు చోరీ చేశారు. స్థానికుల కథనం మేరకు.. అనగొల్ల పాళెం గ్రామానికి చెంది న కట్టబోయిన పరంధామయ్య ఎడగారులో బోర్ల ఆధారంగా వరి సాగు చేశాడు. బుధవారం సాయంత్రం వరకు పొలం వద్ద వున్నాడు. గురువారం అక్కడికి వెళ్లి చూడగా మోటార్ స్టార్టర్, కేబుల్ చోరీకి గురైనట్టు గుర్తించాడు. అదేవిధంగా ఆరూరు, తాడిమేడు, తంబుగారిపాళెం గ్రామాల రైతుల పొలాల్లోని స్టార్టర్లు, కేబుల్ వైర్లు చోరీకి గురవుతున్నట్టు బాధితులు వాపోతున్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వెంకటగిరి రూరల్ : గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి తెలిపారు. మండలంలోని కశవలపూడి పంచాయతీలో గురువారం ఐవీఆర్ఎస్ డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చెత్తను కుండీల్లోనే వేయాలని సూచించారు. పైపులైన్లు లీకేజీ కాకుండా చర్యలు తీసుకుని తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూపతి, సర్పంచు అక్కల బత్తయ్య, డిప్యూటీ ఎంపీడీవో కేవీ రమణయ్య తదితరులు పాల్గొనారు.

చత్రపతి సాహు మహరాజ్‌కు ఘన నివాళి

చిల్లకూరు/గూడూరు రూరల్ : భారత దేశంలో బలహీన వర్గాల వారికి 50 శాతం రిజర్వేషన్ల అమలుకు శ్రీకారం చుట్టిన గొప్ప దార్శనికుడు చత్రపతి సాహు మహరాజ్ అని పలువురు వక్తలు కొనియాడారు. గూడూరు పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయ్ పూలే విగ్రహాల వద్ద గురువారం సాహు మహరాజ్ జయంతిని జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ నాడు సాహు మహరాజ్ చేపట్టిన రిజర్వేషన్ల కారణంగా నేడు ఎంతో మంది బీసీలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందుతున్నారని వివరించారు. కార్యక్రమంలో బీఎస్పీ గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మీజూరు సుబ్రహ్మణ్యం, నాశిన భాస్కర్‌గౌడ్, రవికుమార్, వెంకటేశ్వరరాజు, ఎల్‌వీ సుబ్బయ్య, పఠాన్ ఖాదర్‌బాషా, మందా రవి, నవీన్, శ్రీనివాసులు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

ఉచ్చూరులో అట్రాసిటి కేసు విచారణ


ఉచ్చూరులో విచారిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

దొరవారిసత్రం : మండలంలోని ఉచ్చూరు గ్రామంలో గురువారం నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అట్రాసిటి కేసు విచారణ చేపట్టారు. ఉచ్చూరు గ్రామం పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన బద్ది బుజ్జమ్మ, చిత్తూరు మునిరెడ్డి ఈ నెల 19న చెరువులో ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. ఆ సమయంలో వారి మధ్య వివాదం తలెత్తింది. బుజ్జమ్మను మునిరెడ్డి తిట్టి నెట్టడంతో కింద పడింది. చేయికి గాయమైంది. ఈ విషయం బాధితురాలు మునిరెడ్డి తండ్రి వెంకటమునికి తెలిపింది. ఆయన కొడుకును దండించకపోగా ఆమెను వ్యంగంగా మాట్లాడి పంపేశాడు. దీంతో బుజ్జమ్మ చేతికి చికిత్స చేయించుకుని నాలుగు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు తండ్రీకొడుకులపై అట్రాసిటి కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ చెంచుబాబు ఉచ్చూరు గ్రామానికి వెళ్లి ఘటన స్థలంలో విచారణ చేశారు. ఆయన వెంట ఎస్ఐ అజయ్‌కుమార్ ఉన్నారు.

మత్తుతో జీవితాలు నాశనం

మత్తుతో జీవితాలు చిత్తు అవుతాయని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పలువురు అధికారులు తెలిపారు. గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో గురువారం మాదకద్రవ్యాల దుర్వినియోగం–అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు, అధికారులతో కలిసి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మానవ హారాలు ఏర్పాటుచేశారు. మాదకద్రవ్యాలు వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మత్తుకు బానిసలైతే జీవితాలు నాశనమవుతాయని పేర్కొన్నారు. అనంతరం మాదకద్రవ్యాల రహిత సమాజానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

–నాయుడుపేటటౌన్/ చిట్టమూరు/ రాపూరు/ ఓజిలి /సైదాపురం/కోట/దొరవారిసత్రం /వాకాడు/గూడూరు రూరల్/వెంకటగిరి రూరల్/ బాలాయపల్లి/ కలువాయి(సైదాపురం) /సూళ్లూరుపేట/పెళ్లకూరు


నాయుడుపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు


కోట : విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ

- నాయుడుపేటలో డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు, అధికారులతో కలిసి గాంధీ పార్కు నుంచి పాత బస్టాండు వద్ద ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. మానవ హారం ఏర్పాటుచేశారు. ప్రతిజ్ఞ చేశారు. సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మీ, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ అరుణకుమారి, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, ఎంపీడీవో సురేష్ బాబు, ఎంఈవో మునిరత్నం, సీడీపీవో ఉమామహేశ్వరి, మెప్మా సీవో నారాయణమ్మ పాల్గొన్నారు.
- చిట్టమూరులో ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్ఐ చిన్న బలరామయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు, అధికారులు చిట్టమూరు ఆర్టీసీ బస్టాండు నుంచి కొత్తగుంట గ్రామం కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మానవ హారం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో చిట్టమూరు పీహెచ్‌సీ వైద్యులు పద్మావతి, సుఖేందర్ తదితరులు పాల్గొన్నారు.
- రాపూరులో మండల వైద్యాధికారి గౌతమ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి సాయి కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.
- ఓజిలిలో డీఎల్‌పీవో రవీంద్రబాబు, ఎస్ఐ స్వప్న ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం పద్మమ్మ, ఎంఈవో శైలజ తదితరులు పాల్గొన్నారు.
- సైదాపురంలో ఎస్ఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
- కోటలో ఎంపీడీవో దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు, విద్యార్థులు కోటలోని ఎన్‌సీఆర్ నగర్ నుంచి కోట క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అలాగే విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఎన్‌సీసీ నావల్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లు కళాశాల నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ పవన్‌కుమార్, ఎంఈవో మస్తానయ్య, సీడీపీవో మునికుమారి, ఏపీవో అనీలా పాల్గొన్నారు.
- దొరవారిసత్రంలో నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక బీసీ గురుకుల కళాశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగం – అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఐ అజయ్ కుమార్, ఎంపీడీవో గోవర్ధన, ఏఈ మోహన్‌రావు, ఏపీవో మునిరాజ, సూపర్‌వైజర్ అంకమ్మ పాల్గొన్నారు.
- వాకాడులో ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం నుంచి స్థానిక అశోక్ స్తంభం కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ సందీప్, ఏవో దీప, సీఐలు హుస్సేన్‌బాష, ప్రసాద్, ఎస్ఐ నాగబాబు హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- గూడూరులో ఎక్సైజ్ శాఖ ఏఈఎస్ ఊహశ్రీ, సీఐలు శేఖర్ బాబు, కిషోర్‌బాబు, శ్రీనివాస్ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం మాదకద్రవ్యాల దుర్వినియోగం–అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం టవర్‌క్లాక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బాలకృష్ణ, కరీమాబేగం, సూర్యనారాయయణ, సురేంద్రబాబు, ఎస్ఐలు శేషమ్మ, రఫీ, మనోజ్‌కుమార్, తిరుపతయ్య, గోపాల్, సురేష్‌బాబు పాల్గొన్నారు.
- వెంకటగిరిలో సీఐ ఏవీ రమణ ఆధ్వర్యంలో విశ్వోదయ కళాశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్, కాశీపేట, రాజావీధి, పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ విద్యార్థులు మానవహారం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- బాలాయపల్లిలో ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రాజు, ఏపీఎం కిరణ్, సీడీపీవో శంషాద్‌బేగం తదితరులు పాల్గొన్నారు.
- కలువాయిలో ఎస్ఐ కోటయ్య ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

- సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం – అక్రమ రవాణా నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక హోలీ జంక్షన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, ఎస్ఐ బ్రహ్మనాయుడు, ఎంఈవో శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- పెళ్లకూరులో ఎంపీడీవో ప్రమీలారాణి, ఎంఈవో శంకరయ్య, సీఐ సంగమేశ్వరరావు, డీటీ యువరాజ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం–అక్రమ రవాణా నియంత్రణ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవ హారం ఏర్పాటుచేశారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రతిజ్ఞ చేశారు.




గూడూరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, పోలీసులు, వెంకటగిరిలో అవగాహన కల్పిస్తున్న సీఐ ఏవీ రమణ, సూళ్లూరుపేటలో ర్యాలీ చేస్తున్న అధికారులు

టమాటా లోడు వాహనం బోల్తా



వెంకటగిరి రూరల్ : పెంచలకోన– ఏర్పేడు జాతీయ రహదారిలోని కలపాడు వద్ద గురువారం టమాటా లోడుతో వెళుతున్న వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికుల కథనం మేరకు.. మినీ ట్రక్కు టమాటా కాయలు తీసుకుని వెంకటగిరి నుంచి డక్కిలి బయలుదేరింది. కలపాడు వద్ద వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న వారికి స్వల్పగాయాలయ్యాయి. టమాటాలు కిందపడ్డాయి. ఎన్‌హెచ్ పట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికులు టమాటాల కోసం ఎగబడ్డారు.

సికిల్ సెల్ అనీమియా పరీక్షలు చేసుకోవాలి

కలువాయి(సైదాపురం): అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలు సికిల్ సెల్ అనీమియా పరీక్షలు చేయించుకోవాలని జిల్లా న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ సురేంద్రబాబు తెలిపారు. ఆయన గురువారం కలువాయి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రక్తహీనతకు గురై బాధపడుతున్న వారిని గుర్తించి ఆరోగ్య స్థితిగతులపై అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువగా గిరిజనులు అనారోగ్యంతో బాధపడుతుంటారని, వారిపై దృష్టి సారించాలన్నారు. మెడికల్ ఆఫీసర్ విజయలక్ష్మి, వైద్య విస్తరణ అధికారి బాలకొండయ్య, ల్యాబ్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమపై దర్యాప్తు చేయాలని వినతి

నాయుడుపేట టౌన్ : కార్మికులు ప్రాణాలతో చెలగాటమాడుతున్న పెళ్లకూరు మండలం పెన్నేపల్లిలో ఉన్న ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమ యాజమాన్యంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారం నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మీనాక్షి సుందరికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎంఎస్ ఆగర్వాల్ ఉక్కు పరిశ్రమలో కార్మికుల భద్రత చర్యలు చేపట్టడంలో యాజమాన్యం వైఫల్యం చెందిందన్నారు. ఇటీవల పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగి పలువురు ప్రాణాలు పోగొట్టుకున్నారని తెలిపారు. ఈ నెల 24న ప్రమాదం జరిగి ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఉన్నత స్థాయి అధికారులు తనిఖీ చేసి కార్మికులకు రక్షణ కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.